
# ఓటుకొక మార్కు

వసుంధర

**అ**తడి పేరు యోగి. పేరులో ఏముందీ- అతడికి పదవి మీద మహాకాంక్ష!

విద్యార్థి దశలో కాలేజీ ఎన్నికల్లో స్టూడెంట్సుకి అంతవరకూ ఎవరూ కనీవిని ఎరుగని వాగ్దానాలు చేసి పెద్ద మెజారిటీతో గెలిచాడు యోగి. తర్వాత ఆ వాగ్దానాలు నెరవేర్చడానికి ప్రిన్సిపాలు మీద ఒత్తిడి తీసుకొచ్చాడు. ప్రిన్సిపాలుకేం చేయాలో తోచక స్థానిక రాజకీయవేత్తనొకరిని ఆశ్రయించాడు. ఆ రాజకీయవేత్త యోగికి కబురెట్టి ఇంటికి రప్పించుకుని ముందుగా లోకజ్ఞానం కలిగించే కొన్ని పురాణ విశేషాలు చెప్పాడు.



శిబి శరీరం నుంచి మాంసం కోసిచ్చాడు. బలి అధఃపాతాళానికెళ్ళాడు. హరిశ్చంద్రుడు ఆలుబిడ్డలను అంగట్లో అమ్మి కాటికాపరయ్యాడు. ముగ్గురూ చక్రవర్తులే! ఈ ముగ్గురి దుర్దశకూ కారణం ఒక్కటే- అది... ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్న ఆశయం! ఆ ఆశయ ఫలితాలు స్పష్టంగా తెలిసేక సామాన్యులు క్రమంగా వాగ్దానాల జోలికెళ్ళడం మానేసారు. దాంతో వాగ్దానదేవతకు రాజాదరణ ఉన్నా సామాన్యుల నుంచి పూజాపునస్కారాలు లేకుండా పోయాయి. ఆ దేవత శ్రీ మహావిష్ణువును ప్రార్థించింది. ఆయన, "వాగ్దానం- ఇచ్చిన వాడికి కీడునూ, పుచ్చుకున్న వాడికి మేలునూ చేస్తుంది. వాగ్దానభంగంలో ఇది తారుమారౌతుంది. అధిక సంఖ్యాకులు వాగ్దానాలు నిలబెట్టుకోవాలనుకోవడం కృత, త్రేతా, ద్వాపరాల యుగధర్మం. వాగ్దానభంగం కలియుగ ధర్మం. నీకు పూజాపునస్కారాలు పెరగడానికి కలియుగం వచ్చేదాకా వేచి ఉండాలి." అని వాగ్దానదేవతను సముదాయించాడు.

"ఆవిధంగా ఏ వాగ్దానాలైతే పూర్వ యుగాల్లో చక్రవర్తుల పదవులనూ, వైభోగాలనూ పోగొట్టాయో- అవే వాగ్దానాలు కలియుగంలో సామాన్యులు కూడా చక్రవర్తులు కావడానికి దోహదం చేస్తున్నాయి. అయితే వాగ్దానాలతో వచ్చిన పదవి ఆ వాగ్దానాల్ని నిలబెట్టుకోనంత కాలమే నిలబడుతుంది.

ఇది రాజకీయాల్లో పైకి రావాలనుకున్న వారందరూ గుర్తుంచుకోవాలి. ఆ కాలంలోనే- దుష్యంతుడికెందరు భార్యలున్నా వాగ్దానభంగానికి గురైన శకుంతల పుత్రుడు భరతుడే చరితార్థుడయ్యాడు. ఆయన పేరుతో వెలసిన భరతదేశ రాజకీయాలకు వాగ్దాన భంగం పాటించి తీరాల్సిన నియమం. ఈ నియమాన్ని పాటించే..'' అంటూ ఆయన వ్రతకల్ప కథల్లోలా కొన్ని ఉదాహరణలు మొదలు పెట్టి అవి అనంతమని నిరూపించి జ్ఞానోపదేశం చేసాడు.

ఆ తర్వాతనుంచి యోగి ఇంటాబయటా కూడా వాగ్దానభంగ నియమాన్ని పాటిస్తూ- గొప్ప రాజకీయవేత్తగా ఎదిగి ఇటీవలే మంత్రి కూడా అయ్యాడు. నదులు సముద్రంలో కలిసినంత సహజంగా డబ్బాయన్ను చేరింది కానీ ఆయనపై అవినీతి ఆరోపణలు లేవు. ఎటొచ్చీ పెరుగుతున్న సంపద ఆయన భార్యలో కోరికల్ని పెంచింది. ఆమెకాయన వాగ్దానభంగ నియమం తెలియక ఇంట్లో కొంత చీకాకు మొదలైంది.

యోగి భార్య సీత పేదింటిపిల్లే. కానీ కథల్లోని పేదల్లా- పేదరికం సుఖసంతోషాలకు నిలయమనుకోదు. యోగి ఆమె అందాన్ని చూసి ముచ్చటపడి పెళ్ళి చేసుకున్నాడు. ఆమె వైభవజీవితం కోసం తన పేద బావ గోవిందం ప్రేమను తిరస్కరించింది. పెళ్ళైనప్పట్నించీ భర్తనామె తాహతుకు మించిన కోరికలు కోరుతూ వచ్చింది. తాహతురాగానే తీరుస్తానని మాటిచ్చాడాయన. తాహతొచ్చేక ఆమె కోరికలు తీర్చాలనున్నా అందుకాయన వాగ్దానభంగ నియమం అడ్డొచ్చింది. ఆ నియమం తెలియని సీతకు- తమ ఎదుగుదలకు దీటొచ్చే వైభవ జీవితాన్ని గడపలేకపోవడమో పెద్దలోటుగా అనిపించేది. మొదట్లో ఆయన భార్యను సముదాయించాడు. తర్వాత విసుక్కున్నాడు. ఆ తర్వాత నుంచి అంతెత్తున ఎగిరెగిరిపడసాగాడు. దాంతో ఆమె తాత్కాలికంగా తన కోరికలను వాయిదా వేసుకుంది.

ఆ దంపతులకు ప్రభు అనే కొడుకూ, రాణి అనే కూతురూ పుట్టి పెరిగి పెద్దవారయ్యారు. వాగ్దాన భంగ నియమం వల్ల ఆయన వాళ్ళ కోరికలూ తీర్చలేదు. మొదట్లో తండ్రి సముదాయిస్తే సమాధానపడినా క్రమంగా విసుక్కున్నారు వాళ్ళు. ఆ తర్వాతనుంచి తండ్రి మీద అంతెత్తున ఎగిరిపడసాగారు. ఇది అవకాశంగా తీసుకుని సీత కూడా అగ్నికి ఆజ్యం పోస్తుంటే వాళ్ళ పార్టీలో ఆ యింటి పనివాడు నాగులు, తోటమాలి చంద్రయ్య కూడా చేరారు. పదవి, అధికారం ఉన్న యింట్లో భార్యాబిడ్డలతో పాటు పనివాళ్ళకూ ఎక్స్‌పెక్టేషన్స్ ఉంటాయని యోగికి అర్థమైంది. శాసన సభలో స్పీకర్లా వాగ్దాన భంగ నియమం తనను అదుపు చేస్తూంటే ఆయనకు ఇల్లే శాసనసభలా గందరగోళానికి నిలయమైంది. అయితే శాసనసభలోని అనుభవమే ఆయన పట్టిన కుందేటికి మూడే కాళ్ళనూ చేయగలిగింది.

మంత్రి అయేక కూడా యోగి సామాన్య జీవితాన్నే గడుపుతున్నాడన్న విషయాన్ని ప్రజలు తెలుసుకునేలోగానే సాటి మంత్రులు కనిపెట్టేసారు. ఎప్పట్నించో వైభవజీవితానికి అలవాటుపడ్డ వాళ్ళు- పత్రికలు, ప్రజలు తమను యోగితో పోల్చితే ప్రమాదమని కలవరపడ్డారు. ఆయన తమ వెనుక గోతులు తీయడం లేదుకదా అని ఆరాతీస్తే అసలు విషయం బయటపడింది. వారు అర్జంటుగా అతడి దృక్పథాన్ని మార్చడానికి ఓ సీనియర్ మంత్రిని ఎన్నుకున్నారు. ఆయన యోగిని సకుటుంబపరివారంగా తనింటికి రప్పించాడు. పరివారాన్ని రెచ్చగొట్టే కార్యక్రమం తన అర్ధాంగికి అప్పగించి తను యోగితో వేరే గదిలోకి వెళ్ళాడు.

"నీ పరివారం నా యింటి వైభవాన్ని చూసి గుండెలు బాదుకుంటున్నారు. ఇంటికెళ్ళేక నీ పని అయిపోయినట్లే!'' అన్నాడాయన యోగితో జాలిగా.

"ప్రతిపక్షాలు న్యాయమైన కోర్కెలతో శాసనసభను దద్దరిల్లజేస్తూంటేనే చలించలేదు. మా వాళ్ళ స్వార్థపూరితమైన డిమాండ్లకు లొంగుతానా?'' అన్నాడు యోగి.

సీనియర్ చిరాగ్గా యోగిని చూసి, "ప్రతిపక్షాలు అన్యాయానికే ప్రాతినిధ్యం వహిస్తాయి. వాటి కోర్కెలు న్యాయమైనవని ప్రభుత్వ పక్షం పొరపాటున కూడా అనకూడదు. అలాగే నువ్వు ఇంట్లోవాళ్ళని స్వార్థపరులనడం తప్పు. వారి స్వార్థమే మన ప్రగతికి మూలకారణం. వారి స్వార్థాన్ని నిర్లక్ష్యం చేసామో మనకు ఎదుగుదల ఉండదు.'' అన్నాడు.

"అయితే రాజకీయాల్లో మననీ స్థాయికి చేర్చిన వాగ్దానభంగ నియమాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఇంట్లోవాళ్ల కోర్కెలు తీర్చే ఉపాయం మీకు తెలుసా?'' అన్నాడు యోగి. అది కుతుహలంలా కాక సవాలులా ఉంది.


సీనియర్ సీనియర్ లెవెల్లోనే నవ్వి, "మనం గాంధీని ఆదర్శంగా తీసుకుంటామని ప్రజలకు వాగ్దానం చేసాం. నువ్వు సింపుల్‌గా జీవిస్తున్నావు. అంటే వాగ్దానభంగం చెయ్యలేదు. వైభవంగా జీవించకపోతే రాజకీయాల్లో నీ ఎదుగుదల ఇక్కడితో ఆగిపోగలదు. జాగ్రత్త!'' అని హెచ్చరించాడు.

అంతకాలమూ తన నియమాన్నీ కోణంనుంచి చూడని యోగి హడలిపోయాడు. సీనియర్ అతణ్ణి సముదాయిస్తూ, "రాజకీయాల్లో పైకి రావడానికి- కాని వాళ్ళకు వాగ్దానాలివ్వడం ఎంత అవసరమో అయిన వాళ్ళకు కానుకలివ్వడమూ అంతే ముఖ్యం. అదెలా సాధ్యమంటావా- ఏ ఆయుధంవల్లా చావురాదని వరమున్న హిరణ్యకశిపుణ్ణి- ఉగ్రనరసింహుడు తన చేతి గోళ్ళు ఆయుధాలు కావని వాటితో చంపేసాడు. బ్రహ్మదేవుడి వరాలకే ఇలాంటి మెలికలున్నప్పుడు మానవమాత్రులం మన నియమాలకుండవా? వాటిని కనిపెట్టడంలోనే ఉంది తెలివి'' అంటూ కళ్ళు తెరిపించాడు.

ఈ జ్ఞానబోధతో యోగిలో వివేకం మేల్కొంది. ఆయన రాజకీయ చతురత అప్పటికప్పుడే ఓ ఉపాయాన్ని స్ఫురింపజేస్తే అది సీనియర్‌కి లీక్ చేయడం ఇష్టంలేక, "మీరు చెప్పింది ఆలోచించాల్సిన విషయం. మీకు నా ధన్యవాదాలు'' అని సెలవు తీసుకున్నాడు.

ఇల్లు చేరాక భార్యాబిడ్డలు, పరివారం తన మీద పెద్దపెట్టున దాడి





చేస్తారనీ అప్పుడు వారి మీద తనకు స్ఫురించిన ఉపాయం ప్రయోగించి ఆశ్చర్యచకితుల్ని చేయాలనీ యోగి అనుకున్నాడు. కానీ వాళ్ళలో ఒక్కరూ తనని పల్లెత్తు మాట అనకపోవడంతో తనే ఆశ్చర్య చకితుడయ్యాడే తప్ప అది తుఫాను ముందరి ప్రశాంతత అని తెలుసుకోలేకపోయాడు.

నిజానికి సీత, ప్రభు, రాణి, నాగులు, చంద్రయ్య- సీనియర్ మంత్రి ఇంట్లో వైభవం చూసి ఉక్రోషంతో రెచ్చిపోయారు. ఇల్లు చేరాక వాళ్ళంతా కలిసి యోగికి బుద్ధి చెప్పాలనుకుని ఆ బాధ్యతను సీతకు అప్పజెప్పారు.

అప్పుడు సీతకు బావ గోవిందం గుర్తుకొచ్చాడు. అతడూ త్వరగా ధనవంతుడైపోవాలని రాజకీయాల్లో చేరాడు. యోగి మీద అక్కసుతో అతడి ఎగస్పార్టీ వర్కరయ్యాడు. అది తెలిసిన సీత, "మా పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తావా, ఇదేనా నీకు నామీదున్న ప్రేమ?" అని ఫోన్లో గునిసింది. "నీమీద ప్రేమవల్లే నాకు మీ ఆయనంటే ద్వేషం, అది తప్పించి నీకోసం ఏం చేయమన్నా చేస్తాను." అని గోవిందం ఆమెకు తన ఫిలాసఫీ చెప్పాడు.

ఇప్పుడు సీత గోవిందానికి తన గోడు చెప్పుకుంది. అతడది విని తీవ్రంగా రియాక్టయి, "ఏ వైభవాన్నాశించి నన్ను కాదన్నావో ఆ వైభవం నీకింకా దక్కలేదంటే నాగుండె మండిపోతోంది. మీ ఆయన ఎన్నికలప్పుడు తన ఊరివాళ్ళకి బోలెడు వాగ్దానాలు చేసి అన్నీ మర్చిపోయాడు. వాళ్ళనతడిమీదకు రెచ్చగొడతాను. వాళ్ళతణ్ణి నిలదీస్తారు. వేడిమీదుండగా సుత్తిదెబ్బలు పడితేనే ఇనుము మనక్కావాల్సిట్లు వంగుతుంది. నువ్వూ అప్పుడే నీక్కావల్సినవి సాధించుకోవచ్చు" అన్నాడు.

సీత పరిధి పరిమితం. ఆమెకీ ఉపాయం నచ్చి సరేనంది. సరిగ్గా ఆ రాత్రే యోగి భార్యాబిడ్డల్నీ, పరివారాన్నీ పిలిచి అంతవరకూ వాళ్ళు తన్నేమి కోరారో ఓ జాబితా తయారు చేసి తెమ్మన్నాడు. గోవిందం మంత్రం అప్పుడే పనిచేసిందా అని సీత ఆశ్చర్యపడింది. కానీ పిల్లలు, పనివాళ్ళు ఉత్సాహపడి చకచకా కాగితాలు నింపేస్తుంటే తనూ ఆ పనిలో నిమగ్నమైంది.

యోగి వాళ్ళ కాగితాలందుకున్నాక వాటికేసి చూడనైనా చూడకుండా ముందు సీతవైపు తిరిగి, "ఈ జాబితాలో వజ్రాలహారముందా?" అనడిగాడు. ఆమె నొచ్చుకుంటూ, "అయ్యో, దాని విషయం మర్చిపోయాను. ఇప్పుడు రాయొచ్చా?" అంది కంగారుగా.

"రాయొద్దు. రాస్తే అది వాగ్దానమౌతుంది. వాగ్దానాలు నిలబెట్టుకోవడం నా నియమానికి విరుద్ధం. ఈ జాబితాల్లో ఉన్నవేవీ నేను కొనబోవడం లేదు. జాబితాలో ఉండదని తెలుసు కాబట్టి నీకు నేను వజ్రాలహారం ఆర్డరిచ్చేసాను..."

అతడు మాట పూర్తిచేసేలోగానే సీత ఆనందం పట్టలేక పెద్దగా అరిచి స్పృహ తప్పి పడిపోయింది. ఆమెతోపాటే పిల్లలిద్దరూ కూడా అలాగే అరిచి పడిపోయారు. పనివాళ్ళిద్దరూ పరుగున వెళ్ళి నీళ్ళు తెచ్చి ముఖాల మీద చల్లేక ముగ్గురూ లేచి కూర్చున్నారు.

యోగి ఆశ్చర్యంగా, "మీ అమ్మకు స్పృహ తప్పిందంటే అర్థం చేసుకోగలను. మరి మీరెందుకు స్పృహ తప్పారో నాకు తెలియడం లేదు" అన్నాడు పిల్లలతో.

"ఈ జాబితాలో ఉన్నవన్నీ కొంటారనుకున్నాం. మీ జ్ఞాపకశక్తి వాగ్దానాల విషయంలో అంతంత మాత్రం కదా అనుకున్నాం. మా జాబితాల్లో మీరు వాగ్దానం చెయ్యనివి కూడా రాసేసాం. మీ మాట వినగానే మాకు జరిగిన నష్టం అర్థమై...." అని ప్రభు ఇంకా ఏదో అనబోతూండగా అప్పటికా విషయం పనివాళ్ళ ఐక్యూకి తట్టిందేమో ఇద్దరూ పెద్దగా అరిచి పడిపోయారు.

అంతా సద్దుమణిగేక, యోగి- నలభై నిండిన భార్యకు వజ్రాలహారాన్నీ, ఇరవై నిండిన కొడుక్కి ఇంపోర్టెడ్ కారునీ, పదహారు నిండిన కూతురికి ఆమె పాటలకాసెట్ రిలీజుకు ఓ కంపెనీతో కంట్రాక్టునీ ఫైనలైజ్ చేసి- పనివాడికీ, తోటమాలికీ ఇళ్ళ స్థలాలు అలాట్ చేయించాడు.

"గుర్తుంచుకోండి. ఈ కానుకలు వాగ్దాన ఫలితాలు కాదు. వాగ్దానాలకు దారి తీయకుండా జాగ్రత్తపడితే మీకు కోరినవన్నీ లభిస్తాయి. నేను ప్రజాస్వామ్యంలో మంత్రిని. మీరు నా పదవికి భంగం రాకుండా నా నుంచి ప్రయోజనం పొందితే నాకూ సంతోషమే" అన్నాడతడు.

అయిదుగురూ ప్రశంసల జల్లు కురిపిస్తూంటే నిజాయితీతో కూడిన వాటిస్పర్శ యోగిని అమితానంద భరితుణ్ణి చేసింది. అతడికారాత్రి- ఆ మధ్య కాలంలో ఎన్నడూ ఎరుగనంత సుఖనిద్ర పట్టింది. మర్నాడు నిద్ర లేస్తూనే అందుకు కారణం గ్రహించి, "ఇంట్లో ఐదుగురికి కానుకలిస్తే నాకింత తృప్తిగా ఉంది. ఇక నా ప్రజల కోరికలు తీర్చితే ఆ అనుభూతి ఎలా ఉంటుందో?" అనుకుని అంతలోనే,

"తరువాత లేచి ఇలాంటి ప్రగతి నిరోధక భావానికి మదిలో చోటిచ్చాను. నేడేమి కానున్నదో" అని బెంగపడ్డాడు.

అంతలోనే స్వగ్రామంనుంచి ఫోను. అర్జంటుగా అక్కడకు వెళ్ళి చేసిన వాగ్దానాల విషయంలో సంజాయిషీ ఇవ్వాలి. లేకుంటే ఊరివారు పత్రికల్లో, టీవీల్లో తన గురించి దుష్ప్రచారం చేస్తారట. ఉన్నఫళంగా వారికేమైందని కలవరపడ్డాడతడు. నిజం చెబితే తన వజ్రాలహారం పోతుందన్న స్వార్థమూ, పిల్లకూ పనివాళ్ళకూ కూడా ఏమీ దక్కవన్న పరోపకారబుద్ధీ అడ్డురాగా సీత కిక్కురుమనలేదు. కానీ భయంభయంగా, "మరి ఇప్పుడేం చేస్తారు?" అనడిగింది.

"రోట్లో తల పెట్టి రోకటి పోటుకు వెరుస్తామా? రాజకీయాల్లో ఇలాంటి ప్రమాదాలకు సిద్ధపడే ఉండాలి. వాగ్దానభంగం విషయంలో ఇంట్లో ఓ మెలిక పెట్టాను కదా! ప్రజలకూ ఓ మెలిక పెడతాను" అని యోగి హుటాహుటిన స్వగ్రామం వెళ్ళాడు. అక్కడ ఆయన మండువా లోగిలిలోనే శ్రేయోభిలాషులు సమావేశం ఏర్పాటు చేసారు.

"నువ్వు మా ఊరివాడివి. మా ఊరికి గర్వకారణం. నీకు మచ్చ రాకూడదని మా తాపత్రయం. అయితే సహనానికీ హద్దుంటుంది. అది మా సహనానికి వచ్చేసింది. ఇక నువ్వు ఏదో ఒకటి చేయక తప్పదు" అంటూ ఆ ఊరి పెద్ద ఉపోద్ఘాతంగా చెప్పేక జగ్గన్న అనే ఓ పేద రైతు ముందుకొచ్చి ఒకొక్కటిగా ఆయన ఎన్నికల వాగ్దానాలను ప్రస్తావించాడు.

"అంతకుముందు ఎమ్మెల్యే మంచినీటి నిలవకు ఊళ్ళో పెద్ద వాటర్ ట్యాంక్ కట్టిస్తానని శంకుస్థాపన రాళ్ళు పాతించి ఊరుకున్నాడని ఎగతాళి చేసావు. నువ్వు ఎన్నికైన ఆరునెలల్లో ఊళ్ళో ఇంటికొక బోర్‌వెల్ వేయిస్తానన్నావు. రెండేళ్ళైంది. ఇంటికొకటి మాట అటుంచు. ఊరికొక్కటికూడా వేయించలేదు" అన్నాడు జగన్న.

"సరే రేపే ఈ ఊరికో బోర్‌వెల్ వేయిస్తాను. ఎక్కడో మీరు చెప్పాలి" అన్నాడు యోగి. ఇంటికొకటి అన్నాక ఊరికొకటి వేయిస్తే అది వాగ్దానభంగమే కదా అని మనసులో మురుస్తూ.

"ఊళ్ళో సన్నకారు రైతులు వెయ్యిమందున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే వాళ్ళకు చౌకగా విద్యుత్తు



నిప్పిస్తానని మాటిచ్చి తప్పాడని నవ్వావు. నువ్వేమో పదవిలోకి వచ్చిన వెంటనే అందరికీ ఉచిత విద్యుత్తు ఇస్తానన్నావు. ఇంతవరకూ ఒక్క రైతుకి కూడా అది రాలేదు.''

''పాత ఎమ్మెల్యే కాలంలో రోజుకి పన్నెండు గంటలు పవర్‌కట్ అని విమర్శించి అసలు పవర్‌కట్ అనేదే లేకుండా ఎత్తేస్తానన్నావు. ఇంతవరకూ నాలుగు గంటలైనా తగ్గించలేదు.'' అన్నాడు జగన్న నాలుగంటే నాలుగు గంటలు తగ్గిస్తానంటాడేమోనని ఆశపడి.

''పాత ప్రభుత్వం చేసిన తప్పులు దిద్దడానికి మాకింకా సమయం కావాలి. అందాకా ఓ గంట తగ్గించి పవర్‌కట్ పదకొండు గంటలకు మార్పిస్తాను'' అన్నాడు యోగి.

జగ్గన్న చదువుతున్నాడు. యోగి బదులిస్తున్నాడు. అలా కొంతసేపు జరిగేక ఓ వృద్ధుడు ముందుకొచ్చి, ''గుర్తున్నానా బాబూ! చిన్నప్పుడు నేనే నీకు అక్షరాభ్యాసం చేసాను. ప్రైమరీ స్కూల్లో ఐదేళ్ళు పాఠాలు కూడా చెప్పాను. అందుకు బదులుగా నువ్విప్పుడు నాదో చిన్న సందేహం తీర్చాలి'' అన్నాడు యోగితో.

యోగి చటుక్కున వంగి ఆయనకు పాదాలంటి నమస్కరించి, ''ప్రతిరోజూ మీ నామస్మరణ చేస్తాను. ఈ రోజు మీ పాదస్పర్శ లభించడం నా అదృష్టం. ఆజ్ఞాపించే హక్కున్న మీరు నన్ను సందేహాలడగడానికి సంకోచించడం భావ్యంకాదు'' అన్నాడు అతి వినయంతో.

**''బాబూ! వాగ్దానాలు నెరవేర్చాల్సివచ్చినప్పుడే తప్ప అవి చేసేటప్పుడు మీరు పాత ప్రభుత్వాల తప్పులు అంచనా వేయరా? చేసిన వాగ్దానాలను సంజాయిషీ అవసరం లేకుండా నెరవేర్చాలని మీకు అనిపించదా?''**

ఆ వృద్ధుడు వెంటనే, ''బాబూ! వాగ్దానాలు నెరవేర్చాల్సివచ్చినప్పుడే తప్ప అవి చేసేటప్పుడు మీరు పాత ప్రభుత్వాల తప్పులు అంచనా వేయరా? చేసిన వాగ్దానాలను సంజాయిషీ అవసరం లేకుండా నెరవేర్చాలని మీకు అనిపించదా?'' అన్నాడు.

ఈ ప్రశ్నలో మనదేశ రాజకీయ వేదాంతసారమంతా ఇమిడి ఉన్నదని అర్థమైన యోగి, ''మేస్టారూ! సర్వజ్ఞులైన మీకే తెలియకపోతే ఈ ప్రశ్నకు సమాధానం నేనూ చెప్పలేను. అదలాగుంచండి. చిన్నప్పుడు మీ ప్రశ్నలకు నేనిచ్చిన సమాధానాలకు మార్కులు వేసేవారు. ఇప్పుడు వాగ్దానాల విషయంలో ఇక్కడ జరిగినదంతా చూసారు కదా. పాత ఎమ్మెల్యేకెన్ని మార్కులు వేస్తారో నాకెన్ని మార్కులు వేస్తారో మీరే ఇక్కడున్న జనాలకు చెప్పాలి'' అంటూ తన రాజకీయ చతురతతో సమాధానాన్ని కప్పదాటు వేయించాడు.

ఆ వృద్ధుడు తడుముకోకుండా, ''నీ చిన్నప్పుడు మీ యింట్లో ఓ పాడి ఆవుకు ప్రమాదంలో ఓ కాలు పోయింది. దాన్ని దృష్టిలో ఉంచుకుని పరీక్షలో ఆవు కెన్ని కాళ్ళుంటాయని అడిగితే మూడని వ్రాసావు నువ్వు. ఇంచుమించు అన్ని ప్రశ్నలకూ సమాధానాలు అదే స్థాయిలో ఉండడం వల్ల నిన్నా పరీక్షలో పాసు చెయ్యాలంటే ఆవుకాళ్ళ ప్రశ్నకు ఎన్నోకొన్ని మార్కులు వేయడం తప్పనిసరి అయింది. అప్పుడు నేను కాలుకొక మార్కు అన్న నియమం పెట్టుకుని నీకు మూడు మార్కులు వేసాను. ఇప్పుడు నువ్వు ప్రాజ్ఞుడివయ్యావు. వాగ్దానాల విషయంలో నా ఫార్ములాని అనుసరించి నీకెన్ని మార్కులు వస్తాయో నువ్వే అంచనా వేసుకో. రామాయణంలో రాముడూ, భారతంలో పాండవులూ నా ఫార్ములాను పాటించి ఉంటే ఆ కథలు మరోలా ఉండి ఉండేవేమో'' అన్నాడు.

ఆవుకి మూడు కాళ్ళు అంటే కాలికొక మార్కువేయాలా- ఆ సమాధానం తప్పనాలా అని ఆలోచించడానికి బదులు అక్కడున్న చాలామంది- అప్పటికే మనసులో తన మార్కులు లెక్కించడం ప్రారంభించిన యోగి వైపే చూస్తున్నారు. ఆయనే మన నాయకుడు మరి!

